

రంజాన్ వేళలు
ఇఫ్తార్ : మంగళవారం 6:26(సాయంత్రం)
సెహరీ : బుధవారం 4:44 (ఉదయం)



భక్త జనసందోహం నడుమ కొనసాగుతున్న ప్రభోత్సవం

శివ పార్వతుల ప్రభోత్సవం

- నందివాహన సేవ, మహా సరస్వతిగా అమ్మవారు
- మల్లయ్య నామస్మరణతో తరించిన కన్నడ భక్తులు
- భక్తిప్రపత్తులతో వీరాచార్య విన్యాసాలు, అగ్నిగుండ ప్రవేశం
- నేడు పంచాంగ శ్రవణం, రథోత్సవం
- అమ్మవారికి రమావాణి సేవిత రాజరాజేశ్వరి అలంకారం



శ్రీశైలం, ఏప్రిల్ 8: శ్రీగిరి క్షేత్రంలో ఉగాది మహోత్సవాల్లో భాగంగా మూడోరోజు సోమవారం స్వామి, అమ్మవార్లకు ప్రభోత్సవం, నందివాహన సేవ నిర్వహించారు. క్షేత్ర రథవీధుల్లో అశేష భక్తజనం మధ్య స్వామి, అమ్మవార్లు వైభవంగా ఊరేగారు. పుష్ప ప్రియుడైన మల్లన్నను సుగంధ పుష్పాలు, పరిమళ ద్రవ్యాలతో అలకంరించిన ప్రభపై ఊరేగించారు. ఈ వేడుక అనంతరం రాత్రి భ్రమ రాంబ సమేత మల్లికార్జునుడు నందివాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. మహా సరస్వతి అలంకారంలో అమ్మవారు దర్శనమిచ్చారు. చతుర్భుజాలలో వీణ, అక్షరమాల పుస్తకాన్ని ధరించి దర్శనం ఇచ్చారు. ముందుగా అలంకార మండ పంలో ఉత్సవమూర్తులను సుగంధపుష్పాలతో ముస్తాబైన నందివాహనంపై అధిష్ఠింపజేసి అర్చకులు పూజలు జరి పారు. స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను మంగళవాయి ద్యాలు, కళాకారుల సంగీత, జానపద నృత్యాల నడుమ ఆలయం రాజగోపురం నుంచి వెలుపలికి తోడ్కొనివచ్చి, గంగాధర మండపం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం క్షేత్ర వీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామోత్సవం ముందు కోలాటం, చెక్కభజన, జానపద పగటి వేషాల ప్రదర్శన, కేరళ కథాకళి, తప్పెట చిందు, కర్ణాటక జాంజ్, వీరగాసి, కొమ్ముువాయిద్యం, శంఖానాదాలు మార్మోగాయి. గ్రామోత్సవం గంగాధర మండపం మీదుగా నంది మం డపం, బయలు వీరభద్రస్వామి ఆలయం దాకా కొన సాగింది. గ్రామోత్సవంలో దేవస్థానం అధికారులు, సిబ్బంది, వేలాది మంది భక్తులు పాల్గొన్నారు.

భక్తిప్రపత్తులతో వీరాచార విన్యాసాలు, అగ్నిగుండ ప్రవేశం

సోమవారం రాత్రి శివదీక్షా శిబిరాల వద్ద వీరాచార సంప్రదాయాన్ని అనుసరించి భక్తులు వీరాచార విన్యాసాలు, అగ్నిగుండ ప్రవేశంలో పాల్గొన్నారు. కర్ణాటకకు చెందిన వీరశైవ భక్తులు వీరభద్ర వచనాలను పఠిస్తూ శూలాలు తమ చెంపల్లోకి, నాలుకల్లోకి, పెదవులలోకి, కడుపులోకి, చేతులకు గుచ్చుకున్నారు. తరువాత భక్తిప్రవత్తులతో నిప్పులపై నడిచారు. ఈ విన్యాసాలు చూపరులను ఆకట్టుకున్నాయి.

● నేడు ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని ఉదయం 9గంటలకు పంచాంగ శ్రవణం, సాయంత్రం 5 గంటలకు రథోత్సవం, రాత్రి అమ్మవారికి రమా వాణి సేవిత రాజరాజేశ్వరి అలంకారం నిర్వహించనున్నారు.



ఉత్సవంలో కళాకారుల విన్యాసాలు

భయపెడుతున్న భానుడు

చాగలమర్రిలో 45.2 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు



చాగలమర్రిలో నిర్మానుష్యంగా ఉన్న పాత బస్టాండు రహదారి

చాగలమర్రి, ఏప్రిల్ 8: జిల్లాపై భానుడు తన ప్రతాపాన్ని చూపుతున్నాడు. గతంలో ఎన్నడూ లేని విధంగా రికార్డు స్థాయిలో పగటి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. దీంతో ప్రజలు బయటకు రావాలంటే భయపడుతున్నారు. చాగలమర్రి మండలంలో సోమవారం ఒక్కరోజే 45.2 డిగ్రీల మేర ఉష్ణోగ్రత నమోదైనట్లు తహసీల్దార్ రమణ తెలిపారు. ఎండలతో పాటు వడగాల్పులు తోడు కావడంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. వాతావరణంలో వచ్చిన పెను మార్పులే అధిక ఉష్ణోగ్రతలకు కారణమని వాతావరణ శాస్త్రవేత్తలు అంటున్నారు. మరో రెండు రోజుల పాటు ఎండలు ఇలాగే ఉంటాయని తెలిపారు. తగు జాగ్రత్తలు తీసుకోకుండా బయటకు వెళ్లవద్దని వాతావరణ శాఖ అధికారులు, వైద్యులు హెచ్చరిస్తున్నారు.



గొడుగు సహాయంతో వెళ్తున్న విద్యార్థినులు

ముగ్గురు వలంటీర్లపై వేటు

● ఫీల్డ్ అసిస్టెంట్ సహా ఓ మేట్ సస్పెండ్

డోన్, ఏప్రిల్ 8: డోన్ నియోజకవర్గంలో వైసీపీ ప్రచారంలో పాల్గొంటున్న ముగ్గురు వలంటీర్లపై వేటు పడింది. సోమవారం పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో తహసీల్దార్ మాధవకృష్ణారెడ్డితో కలిసి ఆర్డీవో మహేశ్వరరెడ్డి విలేకరులతో మాట్లాడుతూ ప్యాపిలి మండలంలోని జలదుర్గం వలంటీర్ వెంకట కుమార్, బురుజులలో రాజకీయ ప్రచారంలో పాల్గొన్న వలంటర్ చిన్నదేవుడు, డోన్ మండలం వెంకటనాయునిపల్లె వలంటీర్ ప్రసాద్‌లను కలెక్టర్ సస్పెండ్ చేసినట్లు తెలిపారు. అదే విధంగా ప్యాపిలిలో డీలర్ రాజా రవికాంత్‌ను తాత్కాలికంగా తొలగించినట్లు తెలిపారు. యు.కొత్తపల్లి గ్రామంలో రాజకీయ ప్రచారంలో పాల్గొన్న ఫీల్డ్ అసిస్టెంట్ మన్సూర్ అలీఖాన్, మేట్ మధులను సస్పెన్షన్ చేసినట్లు తెలిపారు. అదే విధంగా ఓ టీచర్‌పై వచ్చిన ఫిర్యాదుపై చర్యలకు సిఫారసు చేసినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి తెలిపారు.

తరలివచ్చె తనే వసంతం

- నేడు క్రోధి నామ ఉగాది
- పంచాంగ శ్రవణాలకు సిద్ధమైన ఆలయాలు
- పండుగ కొనుగోళ్లతో మార్కెట్ సందడి





వేప, మామిడి ఆకులను కొనుగోలు చేసేందుకు వచ్చిన ప్రజలు

నంద్యాల, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): కోయిల గొంతుతో కొత్త పాటలు పాడి.. నెమళ్ల అడుగులతో భరతనాట్యమాడి.. మామిడి చిగుళ్ల తోరణాలు కట్టి.. శిశిర స్పర్శతో చిన్నబోయిన వనాలను చల్లగా పలకరించే వసంత రుతువు రానే వచ్చింది. షడ్రుచుల సమ్మేళనమై మన ముంగిట వాలింది. అదే అచ్చతెలుగు సంవత్సరాది. మనందరి ఉగాది... వేడుకలకు ముస్తాబైంది. తెలుగు వారంతంగా ఘనంగా చేసుకొనే అత్యంత ప్రీతికరమైన వేడుక 'ఉగాది'ని మంగళవారం ఉమ్మడి జిల్లా ప్రజలు ఘనంగా నిర్వహించుకోనున్నారు. తెలుగువారందరికీ ఉగాది ముఖ్యమైన పండుగ కావడంతో ఉమ్మడి జిల్లాలో 'శ్రీ క్రోధి' నామ సంవత్సర ఉగాది వేడుకల సందడి నెలకొంది. వేడుక రోజున కొత్త దుస్తులు ధరించి, ఉగాది పచ్చడి స్వీకరించి, ఇంటిల్లి పాదీ సమీప ధార్మిక, ఆధ్యాత్మిక క్షేత్రాల్లో నిర్వహించే పంచాంగ శ్రవణాలకు ఆలకించే సంప్రదాయం అందరూ ఆచరిస్తున్నారు. ఈ నేపథ్యంలో వివిధ ప్రాంతాల్లో కవి సమ్మేళనాలు నిర్వహిస్తున్నారు. కొత్త సంవత్సరంలో చేపట్టబోయే కార్యక్రమాలన్నీ విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ నూతన వస్తు, వాహనాలను కూడా కొనుగోళ్లు చేయనున్నారు. ఉభయ జిల్లాలలో ఉగాది వేడుకల సందడి వివిధ పుణ్యక్షేత్రాల్లోనూ కనిపిస్తోంది. ఉగాది పర్వదిన సందర్భంగా శ్రీశైల క్షేత్రంలో ఉగాది మహోత్సవాలు ప్రారంభం కాగా, కర్ణాటక, మహారాష్ట్ర, తెలంగాణా రాష్ట్రాల నుంచీ భక్తులు శ్రీగిరికి చేరుకున్నారు. అలాగే మహానంది, అహోబిళం, యాగంటి వంటి పుణ్యక్షేత్రాల్లోనూ వేడుకల సందడి బాగా కనిపిస్తోంది. ఉగాది వేడుక సందర్భంగా నంద్యాల పట్టణంతో పాటు జిల్లా వ్యాప్తంగా పూజా సామగ్రి, పూల కొనుగోళ్లకు గిరాకీ పెరిగింది.

షడ్రుచుల పచ్చడి

అన్ని పండుగలకు పిండివంటలు చేస్తారు. ఉగాది రోజున వాటికి తోడు ఉగాది పచ్చడి చేస్తారు. కొత్త చింతపండు, లేత మామిడి ముక్కలు, బెల్లం, వేపపూత, చెరకు ముక్కలు, కారం, ఉప్పు తదితరాలు కలిపి... షడ్రుచులతో తయారయ్యే ఈ పచ్చడి ఆరోగ్య, ఆధ్యాత్మిక సందేశాన్ని ఇస్తుంది. జీవితం 'అన్ని రుచుల' సమ్మిళితమని, కష్ట సుఖాలను అనుభవిస్తూ ముందుకు సాగాలనే అర్థం ఇందులో దాగుంది. ఉగాది పచ్చడిని పరగడుపున తీసుకుంటే ఆరోగ్యానికి కూడా చాలా మంచిది.

రైతులను నట్టేట ముంచిన జగన్: గౌరు చరిత

పాణ్యం, ఏప్రిల్ 8: ముఖ్యమంత్రి జగన్ రైతులను నట్టేట ముంచారని పాణ్యం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గౌరు చరిత అన్నారు. మండలంలోని బలపనూరులో టీడీపీ శంఖారావం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ భూసర్వే పేరిట రైతుల భూములను అస్తవ్యస్తం చేశారన్నారు. బలపనూరులో సమగ్ర భూసర్వే పేరుతో చేసిన సర్వేతో రైతుల భూముల ఆన్‌లైన వివరాలు తప్పుల తడకగా మారాయన్నారు. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. కోట్లాది రూపాయల ప్రజల డబ్బు ఖర్చు చేసి పంపిణీ చేసిన పాసుపుస్తకాలు ఎందుకూ పనికి రాకుండా నిరుపయోగమయ్యాయని అన్నారు. ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారన్నారు. భూసమగ్ర సర్వేలో పంట పొలాల్లో ఏర్పాటు చేయాల్సిన సరిహద్దు రాళ్లపై తన ముఖ చిత్రం వేసుకొని ఆనందం పొందుతున్నారన్నారు. ఇటీవల ప్రభుత్వం తయారు చేసిన సరిహద్దు రాళ్ల తయారీ దారులు తమకు ప్రభుత్వం నిధులు ఇవ్వలేదని గ్రానైట్ పరిశ్రమ మూసివేశారన్నారు. ప్రజా వ్యతిరేక పనులతో అన్ని వర్గాలకు వైసిపి ప్రభుత్వం వ్యతిరేకంగా మారిందన్నారు. ప్రజలు ఎప్పుడు ఎన్నికలు వస్తాయా అని ఎదురు చూస్తున్నారన్నారు. మహాశక్తి కార్యక్రమంలో భాగంగా టీడీపీ మహిళలకు సూపర్ సిక్స్ పథకాలను రూపొందించిందన్నారు. తల్లికి వందనంలో భాగంగా ఇంట్లో చదివే పిల్లలందరికీ ప్రతి ఏటా రూ.15వేలు అందిస్తుందన్నారు. ఆడబిడ్డ నిధి నుంచి 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు నెలకు రూ.1500 అందిస్తుందన్నారు. దీపం పథకం ద్వారా ప్రతి ఏటా ప్రతి కుటుంబానికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందజేస్తామన్నారు. మహిళలకు ఉచితంగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం కల్పిస్తుందన్నారు. ఐదేళ్లలో 20 లక్షల మంది యువతకు ఉపాధి. నిరుద్యోగ యువకులకు ప్రతి నెలా యువగళం నుంచి రూ. 3 వేలు జీవన భృతి కింద అందిస్తామన్నారు. రైతులకు ప్రతి ఏటా రూ. 20 వేలు ఆర్థికసాయం అందిస్తామన్నారు. టీడీపీ మేనిఫెస్టోతో రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్తు వస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ భాస్కరరెడ్డి, టీడీపీ మండల కన్వీనర్ గణపం జయరామిరెడ్డి, శివశంకరరెడ్డి, ఎర్రమల మద్దిలేటి, గోవర్ధన్‌రెడ్డి, రామేశ్వరరెడ్డి, రమణారెడ్డి, మురారి, సుధాకర్, రామచంద్రారెడ్డి, అమరనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బలపనూరులో మాట్లాడుతున్న గౌరు చరిత

వెట్టిచాకిరి వ్యవస్థ నిర్మూలన అందరి బాధ్యత

● సీనియర్ సివిల్ న్యాయాధికారి వెంకటేశ్వరరావు



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వరరావు

ఆత్మకూరు రూరల్, ఏప్రిల్ 8: వెట్టిచాకిరి వ్యవస్థ నిర్మూలన మన అందరి బాధ్యత అని సీనియర్ సివిల్ న్యాయాధికారి వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం ఆత్మకూరు కోర్టు ఆవరణలో సీనియర్ సివిల్ జడ్జి ఆధ్వర్యంలో పలు శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. న్యాయాధికారి మాట్లాడుతూ.. ఆత్మకూరు పట్టణంలోని హోటళ్లు, మెకానిక్ షాపులు, దుకాణాలలో పని చేస్తున్న బాల కార్మికులను గుర్తించి వారిని వెట్టి చాకిరి నుంచి విముక్తి చేసి వారికి చదువుకునే ఏర్పాట్లు చేయాలన్నారు. అనంతరం ఐసీడీఎస్, లేబర్ ఆఫీసర్ పోలీసు శాఖ, న్యాయవాదులు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులతో కలసి పట్టణంలోని హోటళ్ల మెకానిక్ షాపులు, వ్యాపార దుకాణాల్లో తనిఖీలు చేపట్టారు. కార్యక్రమంలో న్యాయవాదులు బలరాం నాయక్, మాణిక్యరావు, లేబర్ ఆఫీసర్ నీలిమ, సంధ్య, ఐసీడీఎస్ అధికారులు, స్వచ్ఛంద సేవాసంస్థ అధ్యక్షుడు జుల్‌ఫికర్ ఖాన్ పోలీసు అధికారులు పాల్గొన్నారు.

'అక్రమ బోరు బ్లాస్టింగ్‌లను అరికట్టాలి'

పాణ్యం, ఏప్రిల్ 8: మండలంలోని తమ్మరాజుపల్లెలో జరుగుతున్న అక్రమ బోరుబ్లాస్టింగ్‌లను మైనింగ్ అధికారులు అరికట్టాలని సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి అరుణ్ కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం తమ్మరాజుపల్లెలో ఈనెల 6వ తేదీన బ్లాస్టింగ్ పేళుల్లకు కూలిన మిద్దెను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పరిమితికి మించి 200 అడుగుల మేరకు బోరు వేసి బ్లాస్టింగ్ చేయడంతో సమీప ఇళ్లు కూలిపోతున్నాయన్నారు. అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. పేళుల్ల నిందితులను పట్టుకోవడంలో విఫలమయ్యారని ఆరోపించారు. బోరు బ్లాస్టింగ్‌లతో గ్రామంలోని తాగునీరు కలుషితమై ప్రజలు రోగాల బారిన పడే ప్రమాదముందన్నారు. బ్లాస్టింగ్‌ల వల్ల భూగర్భ జలాలు అడుగంటి పోతున్నాయన్నారు. పర్యావరణానికి బ్లాస్టింగ్‌లు అవరోధంగా మారాయన్నారు. ఇల్లు కూలడానికి కారణమైన వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధితుడికి నష్టపరిహారం కింద రూ.10 లక్షలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇదే పరిస్థితి కొనసాగితే రెవెన్యూ కార్యాలయం వద్ద పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు చల్లా సురేష్, దుబాయ్ శీను, సుధాకర్‌గౌడ్ పాల్గొన్నారు.

'ఓ నాయకుడి నిర్వాకం వల్లే రిజర్వాయర్ ఆగిపోయింది'

మిడుతూరు, ఏప్రిల్ 8: గడిచిన ఐదేళ్ల వైసీపీ పాలనలో ఓ నాయకుడి నిర్వాకం వల్లే మిడుతూరు మండలానికి అలగనూరు రిజర్వాయర్ ఆగిపోయిందని వైసీపీ నియోజకవర్గ అభ్యర్థి డాక్టర్ దార సుధీర్ ఆరోపించారు. సోమవారం దేవనూరు, సున్నంపల్లి గ్రామాల్లో సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా వైసీపీ నాయకుడు కృష్ణారెడ్డి స్వగృహంలో పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుత ఎమ్మెల్యే ఆర్థర్ కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేస్తే మీ గెలుపు పై మీ అభిప్రాయం అని అడగగా .. ఆర్థర్ లాంటి వారు వస్తుంటారు.. పోతుంటారని పార్టీకి ఎలాంటి నష్టం లేదని అన్నారు.

వలంటీర్ల రాజీనామా

వెలుగోడు, ఏప్రిల్ 8: వెలుగోడు పట్టణంతో పాటు మండలంలోని రేగడ గూడూరు గ్రామానికి చెందిన పలువురు వలంటీర్లు మొత్తం 34 మంది వలంటీర్లు సోమవారం రాజీనామా చేశారు. ఎంపీడీవో కార్యాలయంలో ఏవో ఉమారాణిని కలిసి తమ రాజీనామా పత్రాలను అందజేశారు. వలంటీర్లు వైసీపీ మండల అధ్యక్షుడు ఆధ్వర్యంలో ఆయనతో కలిసి వచ్చి ఏవోకు ఈ రాజీనామా పత్రాలు అందజేయడం కొసమెరుపు.

శిథిలావస్థలో పోలీసు క్వార్టర్లు



ముళ్లపొదల్లో కూలేందుకు సిద్ధంగా ఉన్న పోలీసుల క్వార్టర్లు

బండిఆత్మకూరు, ఏప్రిల్ 8: బండిఆత్మకూరు మండల కేంద్రంలో పోలీసుల క్వార్టర్లు పూర్తిగా శిథిలావస్థకు చేరాయి. గత కొన్ని సంవత్సరాలుగా ఎలాంటి వాడకం లేదు. భవనాలన్నీ గోడలు పగుళ్ల, వాకిళ్ల, కిటికీలు లేకుండా పోయాయి. అంతేకాకుండా వర్షాకాలంలో స్లాబ్‌లు కారుతున్నాయి. ఇక్కడ పనిచేసే పోలీసు సిబ్బంది సగానికి పైగానే నంద్యాల, ఇతర ప్రాంతాల్లో నుంచి విధులకు హాజరవుతున్నారు. ముళ్ల పొదలు చుట్టుముట్టి పెరిగిపోయాయి. ఇప్పటికైనా పోలీసు ఉన్నతాధికారులు బండిఆత్మకూరు పోలీసు కార్టర్లపై దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఏకశిల అభయాంజనేయుడికి ప్రత్యేక పూజలు



పెద్దదేవళాపురం అభయాంజనేయ స్వామిని దర్శించుకున్న భక్తులు

బండిఆత్మకూరు, ఏప్రిల్ 8: మండలంలోని పెద్దదేవళాపురం గ్రామ శివారులో వెలసిన ఏకశిల అభయాంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. సోమవారం అమవాస్య సందర్భంగా ఆలయ నిర్వహకులు నాగేశ్వరరావునాయక్, శివరాజునాయక్ తెల్లవారు జామున స్వామికి అభిషకాలు, అర్చనలు, ఆకు పూజలు నిర్వహించారు. పలు ప్రాంతాల నుంచి భక్తులు ఆలయం వద్దకు చేరుకుని స్వామి వారిని దర్శించి ప్రార్థించారు. భక్తుల కాలక్షేపార్థం చెక్కభజన, పౌరాణిక నాటకం ఏర్పాటు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు. నిర్వాహకులు తేజనాయక్, నాగరాజు, వెంకటరమణనాయక్, ఈశ్వర్‌నాయక్, తేజనాయక్ పాల్గొన్నారు.

ఆత్మకూరు: ఆత్మకూరు పట్టణంలోని పాతబస్టాండ్ సమీపంలో గల ఆత్మలింగేశ్వర స్వామి ఆలయం వద్ద వెలసిన అభయాంజనేయ స్వామికి అర్చకులు అనిల్‌కుమార్ శర్మ ఆధ్వర్యంలో సోమవారం అమవాస్య సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇందులో భాగంగానే ప్రాతః కాల సమయంలో స్వామివారికి పంచామృతాభిషేకాలు జరిపి శాస్త్రోక్తంగా పూజ క్రతువులను చేపట్టారు. అలాగే భజన కార్యక్రమాలు, సామూహిక కుంకుమార్చనతో పాటు ధూప, నక్షత్రహారతులను నివేదించారు. అర్ధరాత్రి 12గంటలకు మహామంగళహారతిని సమర్పించారు. కాగా అమవాస్య సందర్భంగా వేరుశనగ బుడ్డలతో స్వామివారికి విశేష అలంకరణ చేశారు. ఈ సందర్భంగా స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చారు. విచ్చేసిన భక్తులకు ఆలయ కమిటీ వారు తీర్థప్రసాదాలను వితరణ చేశారు.

రేపటి నుంచి వేణుగోపాలస్వామి మహోత్సవాలు

కొత్తపల్లి, ఏప్రిల్ 8: మండలంలోని దుద్యాల గ్రామంలో వెలసిన లక్ష్మీసమేత వేణుగోపాల స్వామి, పార్వతీ సమేత మల్లేశ్వరస్వామి వార్ల కల్యాణ మహోత్సవాలను బుధవారం నుంచి 14వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో కార్తీక్, ధర్మకర్తల మండలి చైర్మన్ శ్రీనివాసరెడ్డి, పురోహితులు సుబ్రహ్మణ్య శర్మ తెలిపారు. సోమవారం వారు దుద్యాలలో విలేకరులతో మాట్లాడుతూ బుధవారం రాత్రి 12 గంటలకు స్వామి కల్యాణాన్ని నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు చెప్పారు. అలాగే 11వ తేదీ రాత్రి 10 గంటలకు ప్రభోత్సవం, 10.30 గంటలకు కాడి, గిరక, బండిలాగుట, బండి చక్రాలు విడదీసి, తగిలించు వంటి పోటీలు ఉంటాయని తెలిపారు. 12వ తేదీ సాయంత్రం 4 గంటలకు రథోత్సవం, రాత్రి 10 గంటలకు సాంస్కృతిక కార్యక్రమాలు, 13న సాయంత్రం 4 గంటలకు పారువేట, తీర్థావలి, వసంతోత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయని చెప్పారు.

కరువు భత్యం విడుదల

మహానంది, ఏప్రిల్ 8: మహానంది దేవస్థానంలో పనిచేస్తున్న రెగ్యులర్ ఉద్యోగులకు ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని రూ.29.18 లక్షలు పెండింగులో ఉన్న పాత బకాయిలు విడుదల చేసినట్లు ఆలయ ఈవో చంద్రశేకర్‌రెడ్డి సోమవారం తెలిపారు. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయంలో ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని, సాయంత్రం భక్తుల సమక్షంలో పంచాంగం పఠనాన్ని చేస్తామన్నారు. ఆలయ ఉద్యోగులకు గత కొన్నేళ్లుగా పెండింగులో ఉన్న బకాయిలు విడుదల కావడంతో హర్షం వ్యక్తం చేశారు. ఆలయ ఉద్యోగులకు తాను పదవీ బాధ్యతలు చేపట్టిన తరువాత లక్షల రూపాయలు చెల్లించామని ఈవో తెలిపారు.

'పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి'




పరిశీలిస్తున్న కమిషనర్ నిరంజన్‌రెడ్డి

నంద్యాల టౌన్, ఏప్రిల్ 8: నంద్యాల మున్సిపాలిటీ పరిధిలో పారిశుధ్యంపై ప్రత్యేకంగా దృష్టి సారించి ఎప్పటికప్పుడు పర్యవేక్షణతో పనులను పూర్తి చేసేందుకు కార్యాచరణ చేపట్టినట్లు మున్సిపల్ కమిషనర్ నిరంజన్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఉదయం పట్టణంలోని పలు ప్రధాన వీధుల్లో ఉన్న మురుగు కాలువల్లో షిల్ట్ తీయడం, ఇతర పారిశుధ్య పనులు, కాలువ పనులను ఆయన పరిశీలించారు. వీధుల్లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన చెత్త నిల్వ కేంద్రాల్లోని పెద్ద డస్ట్ బిన్లు నిండిన వెంటనే డంప్ యార్డుకు తరలించాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం వేసవిని దృష్టిలో పెట్టుకొని పట్టణంలో పురపాలక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాలను పరిశీలించారు. చలివేంద్రాలలో ఏర్పాటు చేసిన కుండల్లో 24 గంటలు మంచినీరు పూర్తిగా ఉండేలా ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయి సిబ్బంది పరిశీలిస్తుండాలని, ఖాళీ అయిన కుండలను నీటినితో నింపాలని ఆదేశించారు. కమిషనర్ వెంట మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

మద్యం స్వాధీనం

పాణ్యం, ఏప్రిల్ 8: మండలంలోని తమ్మరాజుపల్లె సమీపంలోని సిమెంట్‌నగర క్రాస్ రోడ్డు వద్ద సోమవారం ఎక్సైజ్ అధికారులు 32 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు నంద్యాల ఎక్సైజ్ ఎస్‌ఐ శంకర్ తెలిపారు. తమ్మరాజుపల్లెకు చెందిన బాలచంద్రుడు అక్రమంగా మద్యంను తరలిస్తుండగా దాడి చేసి అరెస్టు చేసి మద్యాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ దాడిలో డీటీఎఫ్ విజయకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

బలహీన వర్గాల అభివృద్ధే లక్ష్యం: మాండ్ర



జయహో బీసీ కార్యక్రమంలో మాట్లాడుతున్న మాండ్ర

పాములపాడు, ఏప్రిల్ 8: బడుగు బలహీన వర్గాల అభివృద్ధే లక్ష్యంగా అనేక సంక్షేమ పథకాలను రూపొందించి అమలు చేసిన ఘనత ఒక్క టీడీపీకే దక్కిందని అన్నారు. బీసీలకు సామాజికంగా, రాజకీయంగా ఎదగడానికి తెలుగుదేశం పార్టీ కారణమని నంద్యాల పార్లమెంట్ టీడీపీ ఇన్‌చార్ మాండ్ర శివానందరెడ్డి, నందికొట్కూరు నియోజకవర్గం ఎంఎల్‌ఏ అభ్యర్థి గిత్తా జయసూర్య అన్నారు. సోమవారం మండలంలోని రుద్రవరం గ్రామంలో టీడీపీ నాయకులు సురేశ్, కరీంబాషా ఎంపీటీసీ అరుణ, ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు పాములపాడు గ్రామం నుండి బైక్ ర్యాలీ నిర్వహించారు. సమావేశానికి చేరుకున్న నాయకులుకు క్రిస్టియన్లు, ముస్లిం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. వారు మాట్లాడుతూ టీడీపీ హయాంలో రాష్ట్రం అభివృద్ధి చెందిందని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు తిమ్మారెడ్డి, రవీంద్రనాథ్‌రెడ్డి, హరినాథ్‌రెడ్డి, మధు కృష్ణ, జనసేన రాము, లక్ష్మీకాంతరెడ్డి, సత్యంరెడ్డి తదితరులు పాల్గొన్నారు

కొత్తపల్లి రాష్ట్రంలో ప్రజా సంక్షేమ పాలన కావాలంటే అది టీడీపీ ప్రభుత్వంతోనే సాధ్యమని నందికొట్కూరు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గిత్త జయసూర్య అన్నారు. సోమవారం మండలంలోని దుద్యాల గ్రామంలో మండల కన్వీనర్ నారపురెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జి లింగస్వామి గౌడు, మాజీ మండల కన్వీనర్ మల్లారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన శంఖారావం, సూపర్ సిక్స్ కార్యక్రమంలో గిత్త జయసూర్య ఆ పార్టీ నాయకులు కార్యకర్తలతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. నాయకులు మాండ్ర సురేంద్రనాథ్ రెడ్డి, జడ్ వెంకటరెడిడ్డ, శివారెడ్డి, స్వామిరెడ్డి, పోత నారాయణ, జానకిరాముడు తదితరులు పాల్గొన్నారు.


● మండలంలోని దుద్యాల గ్రామానికి చెందిన వైసీపీకి చెందిన పలువురు మైనార్టీ నాయకులు టీడీపీ నంద్యాల లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి, నందికొట్కూరు టీడీపీ అభ్యర్థి గిత్త జయసూర్య సమక్షంలో టీడీపీలో చేరారు. టీడీపీ మండల కన్వీనర్ నారపురెడ్డి, మాజీ కన్వీనర్ మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'వైసీపీ పాలనలో ఎస్సీలకు అన్యాయం'

పాములపాడు, ఏప్రిల్ 8: దగాకోరు వైసిపి పాలనలో బడుగు బలహీన వర్గాలు, మైనార్టీలు, ఎస్సీలకు అన్యాయం జరిగిందని జనసేన నాయకుడు రాము ఆరోపించారు. సోమవారం మండలంలోని వాణాల గ్రామంలో జనసేన నాయకులతో కలసి కూటమి అభ్యర్థులకు మద్దతుగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ కాలనీలలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ ఒక్కచాన్స్ అంటూ ప్రజలకు మాయ మాటలు చెప్పి అధికారంలోకి వచ్చాక రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి, యువతకు ఉద్యోగాలు లేక వలసలు వెళ్లాల్సిన దుస్థితి నెలకొందని మండి పడ్డారు. జనసేన నాయకులు సూర్యబాబు, బాలస్వామి, అరుణ్, అబ్దుల్లా, అక్బర్, మహేశ్ చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

పనితీరు మార్చుకోండి

● పోలింగ్ కేంద్రాల నిర్వహణపై జేసీ ఆగ్రహం



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న కర్నూలు జేసీ నారపురెడ్డి మౌర్య

గడివేముల, ఏప్రిల్ 8: పనితీరు మార్చుకొని పోలింగ్ కేంద్రాల్లో వసతుల కల్పనపై దృష్టి సారించాలని కర్నూలు జేసీ నారపురెడ్డి మౌర్య అధికారులను ఆదేశించారు. మండలంలోని మంచాలకట్ట, గడివేముల, పెసరవాయి, చిందుకూరు, దుర్వేసి గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను సోమవారం ఆమె పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లోని అసౌకర్యాలపై సంబంధిత అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. చిందుకూరు గ్రామంలోని పోలింగ్ కేంద్రాల్లో కాంపౌండ్ ఏర్పాటు చేయాలని అన్నారు. పోలింగ్ కేంద్రంలో పై పెచ్చులు ఊడి పడుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. దుర్వేసి గ్రామంలోని పోలింగ్ కేంద్రం అపరిశుభ్రంగా ఉండటంతో అధికారులపై మండిపడ్డారు. గడివేముల గ్రామంలోని పోలింగ్ కేంద్రంలోని ఫ్లోరింగ్‌కు మరమ్మతులు చేయించాలని అన్నారు. పోలింగ్ కేంద్రాలకు బూత్ నంబర్లు వేయాలని ఆదేశించారు. 15 రోజుల్లోపు అన్ని పోలింగ్ కేంద్రాల్లో పూర్తి స్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించాలని అన్నారు. లేని పక్షంలో చర్యలు తప్పవని అన్నారు. అనంతరం ఆమె మండల పరిషత్ కార్యాలయంలో పోలింగ్ సరళిపై అధికారులకు అవగాహన కల్పించారు. గడివేముల పాత బస్టాండు ఆవరణలో అధికారులు మానవహారంగా ఏర్పడి ప్రజలకు ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వజ్రాయుధం లాంటిదని అన్నారు. ఓటు హక్కును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక నిఘా ఉంచామని అన్నారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘించిన, ఘర్షణలకు పాల్పడిన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పోలింగ్ శాతం పెంచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పోలింగ్ కేంద్రాలకు చేరుకోలేని వికలాంగులను గుర్తించాలని అన్నారు. ఎంపీడీవో శివరామిరెడ్డి, తహసీల్దార్ జమానుల్లాఖాన్, ఎస్ఐ బీటీ వెంకటసుబ్బయ్య, మండల వ్యవసాయాధికారి హేమసుందర్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ గురునాథం పాల్గొన్నారు.

నీటిలో మునిగి వ్యక్తి మృతి



శశికాంత్ (ఫైల్)

శ్రీశైలం, ఏప్రిల్ 8: శ్రీశైలం జలాశయం దిగువ భాగంలోని లింగాలగట్టు ఘాట్‌లో సోమవారం ఓ వ్యక్తి నీటిలో మునిగి మృతి చెందారు. తెలంగాణ రాష్ట్రం రంగారెడ్డిజిల్లా, బాలాపురం మండలం జైలపల్లిగ్రామానికి చెందిన సొనకుల శశికాంత్(43) అనే వ్యక్తి తన స్నేహితులతో కలిసి ఉగాది ఉత్సవాలకు శ్రీశైలం వచ్చారు. సోమవారం జలాశయం దిగువ భాగంలోని లింగాలగట్టు ఘాట్‌కు చేరుకుని పుణ్యస్నానాలు ఆచరిస్తుండగా నీటిలో మునిగిపోయి మృతి చెందినట్లు రెండవ పట్టణ ఎస్ఐ గంగయ్య యాదవ్ తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గౌరు సమక్షంలో టీడీపీలో చేరిక




టీడీపీలో చేరిన వారితో గౌరు వెంకటరెడ్డి

కల్లూరు, ఏప్రిల్ 8: పాణ్యం నియోజకవర్గంలో వైసీపీకి షాక్ తగిలింది. కల్లూరు అర్బన్ 32 వార్డులో వైసీపీ నాయకులు టీడీపీలో చేరారు. సోమవారం ముజఫర్‌నగర్‌కు చెందిన 25 కుటుంబాలు నందికొట్కూరు పార్టీ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాణ్యంలో వైసీపీకి నూకలు చెల్లాయన్నారు. భారీ మెజార్టీతో పాణ్యంలో టీడీపీ గెలవబోతోందన్నారు. ఎవరెన్ని కుట్రలు చేసినా టీడీపీ విజయాన్ని ఆపలేరన్నారు. రాష్ట్రంలో కూడా టీడీపీ-జనసేన- బీజేపీ కూటమి అధికారం చేపట్టడం ఖాయమన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి: చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని పాణ్యం టీడీపీ అభ్యర్థి గౌరు చరిత అన్నారు. సోమవారం 20వ వార్డు విశ్వసాయినగర్, ధనలక్ష్మీనగర్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించి శంఖారావం, సూపర్‌సిక్స్ పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కర్నూలు మార్కెట్‌యార్డ్ మాజీ చైర్మన్ పెరుగు పురుషోత్తంరెడ్డి, ప్రభాకర్‌యాదవ్, రాయలసీమ విద్యార్థి విభాగం జేఏసీ చైర్మన్ శ్రీరాములు, అయ్యస్వామి పాల్గొన్నారు.

టీడీపీతోనే అందరికీ న్యాయం: బుడ్డా



టీడీపీలో చేరిన వారితో మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి

వెలుగోడు, ఏప్రిల్ 8: టీడీపీతోనే అన్ని వర్గాలకు సమన్యాయం జరుగుతుందని శ్రీశైలం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బుడ్డా రాజశేఖరరెడ్డి అన్నారు. సోమవారం మహానందికి చెందిన సాయి లక్ష్మి, శారద, ప్రసన్న లక్ష్మి, జింకల ఆంజనేయులు, గోపీనాథ్ ఆధ్వర్యంలో 40 కుటుంబాలు, పరమటూరుకు చెందిన గూడన్న, జలాలుద్దీన్, మద్దిలేటి, మధు, రజాక్ ఆధ్వర్యంలో 30 కుటుంబాలు టీడీపీలో చేరాయి. వీరు వేల్పనూరులోని బుడ్డా రాజశేఖరరెడ్డి స్వగ్రామానికి చేరుకుని ఆయన సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వారికి కండువాలు కప్పి బుడ్డా పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. బుడ్డా మాట్లాడుతూ టీడీపీ బలోపేతానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి: బైరెడ్డి



నౌమాన్‌తో చర్చిస్తున్న బైరెడ్డి, ఫరూక్

బండిఆత్మకూరు, ఏప్రిల్ 8: చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని టీడీపీ నాయకుడు బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. సోమవారం ఎ.కోడూరుకు చెందిన మాజీ సర్పంచ్ కుమారుడు మధుసూదన్‌రెడ్డి బైరెడ్డిని కలిశారు. బైరెడ్డి మాట్లాడుతూ ఏ ఆపద వచ్చినా పార్టీ అండగా ఉంటుందని అన్నారు. శ్రీశైలం ట్రస్టు బోర్డు మాజీ సభ్యుడు చిట్టిబొట్ల భరద్వాజశర్మ, అన్వర్‌ఖాన్ ఉన్నారు.

పలువురిని కలిసిన బైరెడ్డి, ఫరూక్

నంద్యాల(నూనెపల్లె): టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, నంద్యాల టీడీపీ అసెంబ్లీ అభ్యర్థి ఎన్ఎండీ ఫరూక్, మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి సోమవారం పలువురు నాయకులను కలిశారు. వైసీపీ సీనియర్ నాయకులు నౌమాన్‌ను, బంగారు నగల వ్యాపారి భవనాశి వాసు, నేషనల్ విద్యా సంస్థల యజమాని డాక్టర్ ఇంతియాజ్ అహ్మద్‌ను వేర్వేరుగా కలిసి చర్చించారు. వచ్చే ఎన్నికల్లో నంద్యాల పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి బైరెడ్డి శబరి, అసెంబ్లీ అభ్యర్థి ఫరూక్‌కు మద్దతు పలకాలని కోరారు.

'జంక్షన్ నిర్మించాలి'



ఎన్నికల అధికారికి వినతిపత్రం ఇస్తున్న బాధిత రైతులు

నందికొట్కూరు, ఏప్రిల్ 8: జాతీయ రహదారి నిరాణంలో తమ పంట పొలాలకు రహదారి కోల్పోతున్నామని, అక్కడ జంక్షన్ ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని నందికొట్కూరు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆత్మకూరు ఆర్డీవో దాసుకు బాధిత రైతులు సోమవారంవినతిపత్రం ఇచ్చారు. సమర్పించారు. రైతు సంఘం అధ్యక్షుడు గోవిందారెడ్డి మాట్లాడుతూ తక్కువ నష్టపరిహారం ఇచ్చినా 340సి జాతీయ రహదారి తమ పొలాల మధ్య వెళ్తుందని సంతోషిస్తే... ఇప్పుడు ఉన్న పొలాలకు వెళ్లేందుకు రోడ్డు లేకుండా జాతీయ రహదారి పనులు నడుస్తున్నాయని అన్నారు. 340సి నేషనల్ హైవే రోడ్డుకు ఇరువైపులా సర్వీస్ రోడ్డు నిర్మాణం చేపట్టి తమ పంట పొలాలకు వెళ్లడానికి పురాతన మార్గమైన నేషనల్ హైవే 340సి 25+450 వద్ద జంక్షన్‌ను నిర్మించాలని డిమాండ్ చేశారు. శివసుబ్బయ్య, మల్లికార్జునరెడ్డి విజయకుమార్‌రెడ్డి, రమేష్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

రైతుల గోడు పట్టదా?



మాధవరం వద్ద ఉన్న నిప్పులవాగు

వెలుగోడు, ఏప్రిల్ 8: వెలుగోడు మండలంలోని రైతుల గోడు వర్ణణాతీతంగా మారింది.గ్రామ ఒడ్డున ప్రవహించే నిప్పులవాగు పరిసర ప్రాంతాల్లో సుమారు 400 ఎకరాల్లో పంటలు సాగు చేశారు. అయితే విద్యుత్ 3 ఫేస్ గత వారం రోజులుగా సరఫరా నిలిచి పోవడంతో బోర్లు ఆడక సాగునీరు అందక పంటలు ఎండుతున్నాయని రైతులు వాపోయారు. ఈ విషయాన్ని విద్యుత్ శాఖ రవీంద్రనాయక్‌ను వివరణ కోరగా నంద్యాలకు మున్సిపాలిటీ అధికారులు తరలించే నీటిని రైతులు వాడుకోకుండా విద్యుత్‌ను నిలిపి వేశామన్నారు. మంగళవారం నుంచి విద్యుత్ సరఫరా చేస్తామన్నారు. సాగు చేసిన పంటలో సుమారు 20 శాతం ఎండి పోయిందని విద్యుత్ సరఫరా నిలిపి వేస్తే రైతులు పంట నష్టపోయి కోలుకోలేని దెబ్బ తగులుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆలటంకం లేకుండా విద్యుత్ సరఫరా చేసి పంటలను కాపాడాలని రైతులు కోరుతున్నారు.

ఏటీఎంలో చోరీ యత్నం

ఓర్వకల్లు, ఏప్రిల్ 8: మండలంలోని కర్నూలు-చిత్తూరు జాతీయ రహదారిపై హుశేనాపురం బస్‌స్టేషన్ సమీపాన ఉన్న ఇండియా-1 ఏటీఎంలో సోమవారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు చోరీ యత్నం చేశారు. ఏటీఎం మెయిన్ డోర్‌ను గ్యాస్ కట్టర్లతో తీసేందుకు ప్రయత్నించారు. అయితే అది రాలేదు. ఈ విషయం తెలిసి ఎస్ఐ రాజారెడ్డి వచ్చి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. నిందితుల వేలిముద్రలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

రేపు ఎన్‌డీఏ కూటమి సమన్వయ కమిటీ సమావేశం

కర్నూలు(అర్బన్), ఏప్రిల్ 8: ఎన్‌డీఏ పక్షాలైన టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి సమావేశం ఈనెల 10న నిర్వహిస్తామని టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీటీ నాయుడు తెలిపారు. జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నిర్వహించే ఈ సమావేశంలో కర్నూలు పార్లమెంట్ నియోజకవర్గం, 7 అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి పోటీ చేస్తున్న అభ్యర్థులు, టీడీపీ, జనసేన, బీజేపీ పార్లమెంట్ స్థానాల అధ్యక్షులు, అసెంబ్లీ నియోజకవర్గాల ఇన్‌చార్జిలు పాల్గొంటారని తెలిపారు.

ఐరన్ ఓర్ అక్రమ నిల్వలు సీజ్

కర్నూలు(అర్బన్), ఏప్రిల్ 8: ఐరన్ ఓర్ అక్రమ నిల్వలు సీజ్ చేసినట్లు గనుల శాఖ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ తెలిపారు. సోమవారం వెల్దుర్తి మండలం బాలాపురం-రేపల్లె దారిలో మధ్య అటవీ భూముల్లో అక్రమ ఐరన్ ఓర్ తవ్వకాలు జరుగుతున్నట్లు గుర్తించామని అన్నారు. పోలీసు, రెవిన్యూ, మైనింగ్ విజిలెన్స్ సంయుక్తంగా తనిఖీలు నిర్వహించి సర్వే నెంబర్ 501,448లో ఐరన్ ఓర్ నిల్వలు ఉన్నట్లు గుర్తించామన్నారు ఈ తనిఖీల్లో రాయల్టీ ఇన్‌స్పెక్టర్ నవీన్, పోలీసు సిబ్బంది, గ్రామ రెవిన్యూ అధికారులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఉగాది బ్రహ్మోత్సవాలు

బనగానపల్లె, ఏప్రిల్8: జిల్లాలో ప్రముఖ శక్తి క్షేత్రమైన నందవరం చౌడేశ్వరిదేవి ఆలయంలో మంగళవారం నుంచి ఉగాది బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి జి. కామేశ్వరమ్మ సోమవారం తెలిపారు. మంగళవారం గణపతిపూజ, పుణ్యాహవాచనం, పంచాంగ శ్రవణం, సాయంత్రం రథోత్సవం, రాత్రి పౌరాణిక నాటక ప్రదర్శన ఉంటాయని తెలిపారు. 10వ తేదీ రాత్రి 9 గంటలకు కళ్యాణోత్సవం, అనంతరం గ్రామోత్సవం, 11వ తేదీ అమ్మవారి రాయబార మహోత్సవం, 12 తేదీ సహస్రనామ కుంకుమార్చన, రాత్రి దివ్విచుక్క పెట్టడం, ఆ తకాంవత జ్యోతి మహోత్సవం నిర్వహిస్తామన్నారు. 13వ తేదీ, 14వ తేదీ సాయంత్రాలు రథోత్సవాలు, 15వ తేదీ వసంతోత్సవం ఉంటాయని తెలిపారు.


నందవరం చౌడేశ్వరిదేవి

14 నుంచి వైఎస్ షర్మిల పర్యటన

డీసీసీ అధ్యక్షుడు జె.లక్ష్మీ నరసింహయాదవ్


మాట్లాడుతున్న లక్ష్మీనరసింహయాదవ్

నంద్యాల టౌన్, ఏప్రిల్ 8: నంద్యాల జిల్లాలో ఈనెల 14వ తేదీ నుంచి 17వ తేదీ వరకు ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల 'ఏపీ న్యాయయాత్ర' పేరుతో కాంగ్రెస్ ఎన్నికల శంఖారావానికి శ్రీకారం చుట్టనున్నారు. సార్వత్రిక ఎన్నికలకు కాంగ్రెస్ సన్నద్ధమవుతున్న నేపథ్యంలో వైఎస్ షర్మిల యాత్ర ప్రాధాన్యతను సంతరించుకుంది. వైఎస్ షర్మిల ఏపీ న్యాయ యాత్ర వివరాలను డీసీసీ అధ్యక్షుడు జె.లక్ష్మీ నరసింహయాదవ్ సోమవారం జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో వెల్లడించారు. ఈనెల 14వ తేదీన ఆళ్ళగడ్డ నియోజకవర్గం నుంచి వైఎస్ షర్మిల యాత్ర ప్రారంభమవుతుందని తెలిపారు. నాలుగు రోజుల పాటు వైఎస్ షర్మిల జిల్లాలోని వివిధ నియోజకవర్గాల్లో పర్యటించడం జరుగుతుందని, 17వ తేదీన డోన్ నియోజకవర్గంలో యాత్ర ముగుస్తుందని తెలిపారు. కేంద్రం, రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే ఏపీ రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే 9 గ్యారెంటీ పథకాలైన మహిళా మహాలక్ష్మి, రైతు నేస్తం, యువ వికాసం, రైతు న్యాయం, ఉచిత విద్య, ప్రత్యేక హోదా, ఉపాధి హామీ, ఇందిరమ్మ ఇళ్లు, కాంగ్రెస్ చేయూత పథకాలను అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గోపవరం గోకుల కృష్ణారెడ్డి, చింతల మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద లావాదేవీలపై నిఘా: కలెక్టర్

కర్నూలు(కలెక్టరేట్), ఏప్రిల్ 8: రూ.లక్షకు పైగా జరిగిన లావాదేవీలు, అనుమానాస్పద ఖాతాల రోజువారి వివరాలను పంపాలని కలెక్టర్ డాక్టర్ జి.సృజన బ్యాంకర్లను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో సాధారణ ఎన్నికలు-2024కు సంబంధించిన వ్యయ పర్యవేక్షణపై బ్యాంకర్లతో పాటు సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎలక్షన్ కమిషన్, ఆర్‌బీఐ నుంచి జారీ చేయబడిన మార్గదర్శకాల ప్రకారం లావాదేవీల వివరాలను 9 బ్యాంకులు మాత్రమే ప్రతిరోజు నివేదికలు ఇస్తున్నాయన్నారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కెనరా బ్యాంకు, యూనియన్ బ్యాంకు, ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకులకు పలుమార్లు చెప్పినప్పటికీ కూడా ఇంత వరకు నివేదికలు కూడా పంపలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. బ్యాంకుల నుంచి నివేదికలు రాకపోతే సంబంధిత బ్యాంకులకు నోటీసులు జారీ చేస్తామని హెచ్చరించారు. బ్యాంకుల కంట్రోలింగ్ ఆఫీసర్స్ ఖచ్చితంగా హాజరు కావాలన్నారు. ఎంసీసీ ఉల్లంఘనలు జరిగినా బ్యాంకు అధికారులే బాధ్యత వహించాలన్నారు. కార్యక్రమంలో ఎల్డీఎం రామచంద్రరావు, డీసీవో రామాంజనేయులు, డీఆర్‌డీఏ పీడీ సలీంబాషా, మెప్మా పీడీ శివనాగలీల, ఇన్‌కం ట్యాక్స్ నోడల్ అధికారి పాండురంగ తదితరులు పాల్గొన్నారు.

యువకుడి దారుణ హత్య

ఇంటి టెర్రస్‌పై నిద్రిస్తుండగా కత్తితో గొంతు కోసిన దుండగులు

నంద్యాల నూనెపల్లి, ఏప్రిల్ 8: నంద్యాల త్రీటౌన్ పోలీసుస్టేషన్ పరిధిలోని వెంకటాచలం కాలనీలో ఆదివారం అర్ధరాత్రి యువకుడు దారుణహత్య కలకలం రేపుతోంది. రెండో అంతస్తు ఇంటి టెర్రస్‌పై నిద్రపోతున్న షేక్ సమీర్(22)ను గుర్తు తెలియని దుండగులు ఇంటిపైకి చేరుకుని కత్తితో గొంతుకోసి దారుణంగా హతమార్చారు. వెంకటాచలం కాలనీలోని వలీ, గౌసియా దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. మొదటి కుమారుడైన షేక్ సమీర్ పగలు డోర్ పాలిష్ పని చేసుకుని, సాయంత్రం దేవనగర్ మసీద్ సెంటర్‌లో చికెన్ పకోడా వ్యాపారం చేస్తాడు. ఆదివారం రాత్రి వ్యాపారాన్ని ముగించుకుని ఇంటికి వచ్చి భోజనం చేసి ఇంటి టెర్రస్‌పైకి పడుకునేందుకు వెళ్లాడు. సోమవారం తెల్లవారుజామున 3గంటలకు రంజాన్ ఒక్కపొద్దు కోసం కుటుంబ సభ్యులు సమీర్‌ను నిద్రలేపేందుకు టెర్రస్ పైకి వెళ్లాడు. చీకట్లో ఎంత పలికినా లేవకపోవడంతో అనుమానం వచ్చి లైట్లు వేసి చూసే సరికి రక్తపు మడుగులో విగత జీవిగా పడి ఉండటాన్ని చూశారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని హత్య జరిగిన తీరును పరిశీలించారు. త్రీటౌన్ సీఐ నరసింహులు, సీసీఎస్ సీఐ మంజునాథరెడ్డి, సిబ్బంది స్థానికుల నుంచి ప్రాథమిక సమాచారాన్ని అడిగి తెలుసుకున్నారు. డాగ్ స్క్వాడ్ బృందం చేరుకుని పరిశీలించింది. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నరసింహులు తెలిపారు.

వైసీపీలో విభేదాలు

- చిచ్చు రేపిన నగర అధ్యక్ష పదవి
- ఏకపక్షంగా పేరు ప్రకటించంపై కార్పొరేటర్ల ఆగ్రహం

కర్నూలు(న్యూసిటీ), ఏప్రిల్ 8: కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గం వైసీపీలో మరోసారి విభేదాలు భగ్గుమన్నాయి. కార్పొరేటర్ సత్యనారాయణమ్మకు జిల్లా అధ్యక్షురాలిగా అధిష్టానం ప్రకటించడతో అంతర్గత విభేదాలు తారాస్థాయికి చేరాయి. పార్టీ కోసం పని చేసిన వారిని కాదని మధ్యలో వచ్చిన వారికి పదవి ఎలా కట్టబెడతారని కొందరు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొందరు పార్టీని వీడేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఇటీవల ఎస్వీ మోహన్‌రెడ్డి వర్గీయులు ఎమ్మెల్యే అభ్యర్థి ఇంతియాజ్‌ను ఆయన నివాసంలో కలిసి తమ నాయకుడికి ఎలాంటి పదవి ఇవ్వకుంటే ఎన్నికల ప్రచారానికి దూరంగా ఉంటామని తేల్చిచెప్పారు. కాగా సోమవారం ఎస్వీ కాంప్లెక్స్‌లో జరిగిన సమావేశంలో ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు, ఎస్వీ మోహన్‌రెడ్డి కలిసి తమ మధ్య విభేదాలు లేవని చెప్పుకొచ్చారు. కర్నూలు నియోజకవర్గ పరిధిలోనే ఇద్దరు బీసీ కార్పొరేటర్లు ఉన్నారు. అందులో 5వ వార్డు, 43వ వార్డుకు చెందిన కార్పొరేటర్లు బీసీ సామాజిక వర్గానికి చెందిన వారు. కురువ సామజిక వర్గానికి చెందిన సత్యనారాయణమ్మను మేయర్‌గా ప్రకటించారు. దీనిపట్ల చాలా మంది కార్పొరేటర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. తాజాగా నియోజకవర్గ పార్టీ అధ్యక్ష పదవిని కూడా ఆమెకే ఎలా ఇస్తారని అంటున్నారు. అన్ని పదవులు ఆమెకే కట్టబెడితే మిగిలిన ఇద్దరు బీసీలు ఏం చేయాలని ప్రశ్నిస్తున్నారు. ఇద్దరు బీసీలలో ఒకరు ఎమ్మెల్యే వర్గానికి చెందిన కార్పొరేటర్ కాగా మరొకరు మాజీ ఎమ్మెల్యేకి చెందిన కార్పొరేటర్.

● అధ్యక్షురాలు లేకుండానే పోస్టరు విడుదల.. కర్నూలు అసెంబ్లీ పరిధిలో తమ మధ్య ఎలాంటి విభేదాలు లేవని చెబుతూ ఎస్వీ మోహన్‌రెడ్డి ఏర్పాటు చేసిన సమావేశానికి, ఎంపీ అభ్యర్థి బీవై. రామయ్య నిర్వహించిన పోస్టర్ విడుదల కార్యక్రమానికి పార్టీ జిల్లా అధ్యక్షురాలు సత్యనారాయణమ్మ హాజరు కాలేదు. ఆమెతో పాటు ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్‌కు సంబంధించిన కార్పొరేటర్లు, నాయకులు కూడ రాలేదు. కర్నూలు నియోజకవర్గానికి చెందిన ఓ నేత అధినాయకత్వం వద్ద సత్యనారాయణమ్మకు జిల్లా అధ్యక్షపదవి కోసం చక్రం తిప్పినట్లు తెలుస్తోంది. తనకు సీటు ఇవ్వకపోయినా తాను చెప్పిన వారికి అధ్యక్ష పదవి ఇవ్వాలని కోరినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలోనే సత్యనారాయణమ్మను అధ్యక్షురాలిగా ప్రకటించినట్లు తెలిసింది. ఇది పార్టీలో తీవ్రమైన విభేదాలకు దారి తీసింది.


ఇటీవల ఎమ్మెల్యే అభ్యర్థి ఇంతియాజ్‌తో చర్చిస్తున్న ఎస్వీ వర్గీయులు

రైలు కింద పడి ప్రేమ జంట ఆత్మహత్య

- మంత్రాలయంలో ఘటన

మంత్రాలయం, ఏప్రిల్ 8: క్షణికావేశం ఇరు కుటుంబాల్లో పెనువిషాదాన్ని నింపింది. ప్రేమించుకోవడంలో నెగ్గిన వారు ఆ ప్రేమను నిలబెట్టుకోవడంలో విఫలమయ్యారు. భవిష్యత్తును ఆలోచించకుండా నిండుజీవితానికి స్వస్తి పలికి ఆత్మహత్య చేసుకున్నారు. కులాలు వేరు కావడంతో పెళ్లికి పెద్దలు ఒప్పుకోరని భయపడ్డ ఓ ప్రేమజంట ఆత్మహత్య చేసుకున్న సంఘటన సోమవారం మంత్రాలయం రైల్వేస్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. రైల్వే ఎస్ఐ గోపాల్, హెడ్ కానిస్టేబుల్ సాయిసర్వేశ్వర్‌రావు, మృతుల కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు వివరాలు ఇలా... మంత్రాలయం మండలంలోని రచ్చుమర్రి గ్రామానికి చెందిన చాకలి చిన్నగోవిందు, లక్ష్మి దంపతుల కుమారుడు వెంకటేశ్ (22), మంత్రాలయం రామచంద్రనగర్‌కు చెందిన మేకల ఆంజనేయులు, జయమ్మల కూతురు నందిని (21) రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నారు. వీరిద్దరు మండలంలోని రచ్చుమర్రి మోడల్ స్కూల్‌లో ఇంటర్మీడియట్ చదివే సమయంలోనే ఒకరినొకరు ప్రేమించుకున్నారు. మేజర్లు అయిన తర్వాత వివాహం చేసుకుందామని నిశ్చయించుకున్నారు. ఈ ప్రేమ వ్యవహారం ఇరువురి తల్లిదండ్రులకు తెలియడంతో వారిద్దరినీ దూరంగా ఉంచారు. వెంకటేశ్ రచ్చుమర్రి గ్రామంలోనే ఉంటూ పొలం పనులు చేస్తుండేవాడు. నందిని కర్నూలు పుల్లయ్య ఇంజనీరింగ్ కాలేజీలో మొదటి సంవత్సరం బీటెక్ చదువుతోంది. ఉగాది పండుగ కావడంతో రెండు రోజుల క్రితం కుమార్తె నందిని తండ్రి ఆంజనేయులు మంత్రాలయానికి తీసుకువచ్చాడు. విషయం తెలుసుకున్న వెంకటేశ్ ఎలాగైనా ఆమెను పెళ్లి చేసుకుందామని మంత్రాలయానికి వెళ్లి తన బైక్‌పై నందితతో కలిసి తుంగభద్ర రైల్వేస్టేషన్‌కు చేరుకున్నాడు. కులాలు వేరు కావడంతో తమ తల్లిదండ్రులు వివాహాన్ని అంగీకరించరని, దానికన్నా ప్రాణాలు తీసుకుందామని భావించారు. ఈ క్రమంలో ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత రైలుపట్టాలపై ఇద్దరు నిల్చుండగా.. బాగల్‌కోట నుంచి మైసూరు వెళ్లే ట్రైన్ నెంబర్.17308 ఢీకొట్టింది. దీంతో వారి మృతదేహాలు చెల్లాచెదురయ్యాయి. విషయం తెలుసుకున్న రైల్వే ఎస్ఐ గోపాల్, హెడ్ కానిస్టేబుల్ సాయిసర్వేశ్వరరావు ఘటనా స్థలానికి చేరుకున్నారు. అక్కడ లభించిన ఆధారాల ద్వారా ఇరు కుటుంబాలకు సమాచారం ఇచ్చి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆదోని ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గోపాల్ తెలిపారు.


చాకలి వెంకటేశ్ (ఫైల్)


మేకల నందిని (ఫైల్)

కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేద్దాం

- జగన్‌రెడ్డిని ఇంటికి పంపే సమయం ఆసన్నమైంది
- గౌరు నివాసంలో టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల సమన్వయ సమావేశం

కల్లూరు, ఏప్రిల్ 8: టీడీపీ కూటమి అభ్యర్థులు అత్యధిక మెజారిటీతో గెలవడానికి సమన్వయంతో కృషి చేద్దామని టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీ నాయకులు అన్నారు. సోమవారం గౌరు స్వగృహంలో చేపట్టిన టీడీపీ కూటమి సర్వసభ్య సమావేశానికి మూడు పార్టీల నుండి గౌరు చరిత, గౌరు వెంకటరెడ్డి, చింతాసురేష్, నాగరాజు, కె.చెన్నయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా గౌరు చరిత మాట్లాడుతూ ఈ ఎన్నికలు అత్యంత కీలకమైనవని, పాణ్యం నియోజకవర్గంలో అన్ని పార్టీల సహకారంతో ముందుకు వెళతామన్నారు. ఎన్నికల ప్రచారంలో పాల్గొని వైసీపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టి ప్రజల మద్దతు కోరతామన్నారు. ఇప్పటికే వైసీపీ తీరువల్ల సాధారణ ప్రజలు ఉద్యోగులు, రైతులు, మహిళలు, నిరుద్యోగులు అవస్థలు పడుతున్నారని అన్నారు. టీడీపీ కూటమి అధికారంలోకి వస్తేనే రాష్ట్రం బాగుంటుందని, చంద్రబాబు సీఎం అయితేనే పరిశ్రమలు, పెట్టుబడులు, యువతకు ఉపాధి సాధ్యమవుతాయని అన్నారు. ఈకార్యక్రమంలో పెరుగు పురుషోత్తంరెడ్డి, ప్రభాకర్‌యాదవ్, బ్రాహ్మణపల్లె నాగిరెడ్డి, పీయూ. మాదన్న, ఎస్వీ. రామకృష్ణ, జనసేన నాయకులు సుధాకర్, షబ్బీర్, సలాం, ప్రవీణ్, బీజేపీ నాయకులు సోమేశ్వరాచారి, గంగాధర్ రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, వీరప్ప, తారకేశ్వరెడ్డి, సోమశేఖర్‌రెడ్డి, మీసాల గంగాధర్ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న గౌరుచరిత

నల్లమల ఘాట్ రోడ్డులో ఆంక్షలు

- దోర్నాల వైపు వెళ్లే గూడ్స్ వాహనాల దారి మళ్లింపు
- పలుచోట్ల పోలీసు చెక్‌పోస్టుల ఏర్పాటు

ఆత్మకూరు, ఏప్రిల్ 8: శ్రీశైలంలో జరుగుతున్న ఉగాది ఉత్సవాలను పురస్కరించుకుని నల్లమల ఘాట్ రోడ్డులో పోలీసుశాఖ అధికారులు పలు ఆంక్షలు విధించారు. గతంలో ఉగాది ఉత్సవాల సమయంలో చోటుచేసుకున్న ఇబ్బందులను పరిగణలోకి తీసుకుని నల్లమల అటవీ ప్రాంతంలోని కర్నూలు-గుంటూరు జాతీయ రహదారి మీదుగా వెళ్లే గూడ్స్ వాహనాలపై నిబంధనలు అమలు చేశారు. ఆత్మకూరు మీదుగా దోర్నాల వైపు వెళ్లే గూడ్స్ వాహనాలు, భారీ వాహనాలను నంద్యాల టర్నింగ్, వెలుగోడు మీదుగా నంద్యాల, గిద్దలూరుల నుంచి దారి మళ్లించేలా చర్యలు తీసుకుంటున్నారు. ఈ నెల 9 నెంచి 11వ తేది వరకు ఈ నిబంధనలను ఇలాగే కొనసాగించనున్నట్లు ఆత్మకూరు అర్బన్ సీఐ లక్ష్మీనారాయణ తెలిపారు. వాస్తవానికి శ్రీశైలంలో జరుగుతున్న ఉగాది ఉత్సవాల సందర్భంగా కర్నాటక రాష్ట్రం నుంచి లక్షలాది సంఖ్యలో పాదయాత్రగా తరలివచ్చారు. అదే విధంగా వివిధ వాహనాల్లో కూడా భారీగా క్షేత్రానికి చేరుకున్నారు. ఉత్సవాల్లో స్వామి అమ్మవార్ల దర్శనం అనంతరం వారు తిరుగు ప్రయాణం కానున్నారు. ఈ నేపథ్యంలో నల్లమల ఘాట్‌రోడ్డులో వాహనాల రద్దీ అధికమై ట్రాఫిక్ జామ్ సమస్య వాటిల్లితే మరింత ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తోంది. వీటన్నింటిని దృష్టిలో వుంచుకుని పోలీసుశాఖ అధికారులు ముందస్తు జాగ్రత్తలతో ఘాట్‌రోడ్డులో ఆంక్షలు విధించినట్లు తెలిసింది. ఇదిలా వుంటే కర్నూలు నుంచి దోర్నాల వైపు వచ్చే వాహనాలను అక్కడ నంద్యాల చెక్‌పోస్టు వద్దే మళ్లించేలా చర్యలు చేపట్టనున్నారు. అదే విధంగా ఒకవేళ ఆత్మకూరు నుంచి వెళ్లే ప్రయత్నం జరిగితే వాటిని నంద్యాల టర్నింగ్ నుంచి నంద్యాలకు మళ్లించాలని సూచిస్తున్నారు. కేవలం శ్రీశైలానికి అత్యవసర సరుకులను చేరవేసే గూడ్స్ వాహనాలకు మాత్రమే అనుమతించనున్నట్లు వారు చెప్పారు.

ఇద్దరు దొంగల అరెస్టు

నంద్యాల(నూనెపల్లె), ఏప్రిల్ 8 : నంద్యాల మండలం రైతు నగర్‌లోని భగత్‌సింగ్ కాలనీలో గత నెలలో జరిగిన చోరీ కేసులో ఇద్దరు దొంగలను అరెస్టు చేసినట్లు డీఎస్పీ రవీంద్రనాథరెడ్డి తెలిపారు. సోమవారం తాలూకా పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ హైదరాబాదుకు చెందిన సుధాకర్, తిరుపతికి చెందిన గణేష్‌లను మండలంలోని పోలూరు క్రాస్ రోడ్డు వద్ద అదుపులోకి తీసుకున్నామన్నారు. వారు రైతు నగర్‌లో జరిగిన చోరీ ఘటనను ఒప్పుకున్నారన్నారు. వారి నుంచి 17 తులాల బంగారు నగలను స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించామన్నారు.

● **నంద్యాలలో భారీ చోరీ :** నంద్యాలలోని 2వపట్టణ పోలీసుస్టేషన్ పరిధిలోని టెక్కెలో ఉన్న తేజ అపార్ట్‌మెంట్‌లో ఇరిగేషన్ ఏఈ సుధీర్ ఇంట్లో భారీ చోరీ జరిగింది. ఉగాది పండగ సందర్భంగా ఇంటికి తాళం వేసి పండుగ సరుకులు తేవడానికి సూపర్ మార్కెట్‌కు వెళ్లాడు. ఇంటికి వచ్చి చూడగా.. తాళం తీసి కనిపించింది. ఇంట్లోని బీరువాలో ఉన్న 40 తులాల బంగారు నగలు చోరీకి గురైనట్లు గుర్తించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రాజారెడ్డి తెలిపారు.

ఉగాది బందోబస్తు ఏర్పాట్ల పరిశీలన


ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ

శ్రీశైలం, ఏప్రిల్ 8: శ్రీశైలం క్షేత్రంలో జరుగుతున్న ఉగాది మహోత్సవాలకు 740 మంది సిబ్బందిని ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ కె.రఘువీర్‌రెడ్డి పేర్కొన్నారు. ఇందులో 9 మంది డీఎస్పీలు, 30 మంది సీఐలు, 62 మంది ఎస్ఐలతో పాటు ఇతర సిబ్బందిని ఉత్సవాల భద్రతలో పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా సోమవారం ఎస్పీ రఘువీర్‌రెడ్డి క్షేత్రపరిధిలోని రథవీధిని, అగ్నిగుండ ప్రవేశ ప్రాంగణం, పార్కింగ్ తదితర ప్రదేశాలలో పర్యటించి భద్రత, ట్రాఫిక్ నిర్వహణపై పోలీస్ సిబ్బందికి తగు సూచనలు చేశారు. ఎస్పీ వెంట ఏఎస్పీ కె.ప్రవీణ్‌కుమార్, ఆత్మకూరు డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ ప్రసాదరావు, సిబ్బంది పాల్గొన్నారు.

రేషన్ బియ్యం తరలింపు

ఓర్వకల్లు, ఏప్రిల్ 8: ఓర్వకల్లులో రేషన్ బియ్యం అక్రమంగా తరలిపోతున్నా అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సోమవారం మధ్యాహ్నం ఓర్వకల్లులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడి కళ్లెదుటే మధ్యాహ్న భోజన పథకానికి అందించే బియ్యాన్ని ఆటోలో తరలించుకపోయినట్లు తెలుస్తోంది. ఓర్వకల్లు గ్రామానికి చెందిన ఓ వ్యక్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని స్టాక్ రూము నుంచి మధ్యాహ్న భోజన పథకం బియ్యాన్ని అక్రమంగా తరలించాడు. ఇది చూస్తూ కూడా ప్రధానోపాధ్యాయుడు పట్టించుకోకపోవడం దారణమని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు విచారణ జరపాలని వారు కోరుతున్నారు.

డోన్

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

మధ్యాహ్న భోజనం పరిశీలన

చాగలమర్రి, ఏప్రిల్ 8: చాగలమర్రి గ్రామంలోని బాలుర, బాలికల పాఠశాలలో విద్యార్థుల కోసం తయారు చేసిన మధ్యాహ్న భోజనాన్ని ఎంఈవో అనూరాధ పరిశీలించారు. సోమవారం బాలుర పాఠశాలలో జరుగుతున్న పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ పరీక్షలు పకడ్బందిగా నిర్వహించాలని సూచించారు. ఎన్నికలకు సంబంధించి 107 మంది పీవో, ఏపీవోలను నియమించామని అన్నారు. వోపీవోలకు నియామక పత్రాలు అందజేస్తున్నామని అన్నారు. ఆమె వెంట సీఆర్పీ అమీర్‌ఖాన్ ఉన్నారు.

ఎన్నికల నియమావళి తప్పనిసరి

చాగలమర్రి, ఏప్రిల్ 8: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఆయా పార్టీ నాయకులు ఎన్నికల నియమావళిని తప్పనిసరిగా పాటించాలని తహసీల్దార్ రమణమ్మ సూచించారు. సోమవారం ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో సభలు, సమావేశాలు నిర్వహించే ముందు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని అన్నారు. ఆయా పార్టీ జెండాలు, ఫ్లెక్సీలు, కటౌట్‌లు ఏర్పాటు చేయాలని అన్నారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. పీవో, ఏపీవోలకు శిక్షణ ఇచ్చామని అన్నారు. ఎన్నికల్లో విధులు నిర్వహించే ఉద్యోగులు తప్పనిసరిగా విధుల్లో పాల్గొనాల్సి ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో వీఆర్వోలు పాల్గొన్నారు.

నేడు పంచాంగ శ్రవణం

చాగలమర్రి, ఏప్రిల్ 8: చాగలమర్రి గ్రామంలోని శివరామానంద ఆశ్రమంలో ఉగాది పండుగ సందర్భంగా మంగళవారం సాయంత్రం అభినవ శంకరానందస్వామి ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణం నిర్వహిస్తున్నట్లు ఎస్ఎస్ఎఫ్ కన్వీనర్ నల్లా నాగరాజు పేర్కొన్నారు. హిందూవులు పంచాంగ శ్రవణంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అలాగే కన్యకాపరమేశ్వరి ఆలయంలో వేద పండితుల ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణం నిర్వహిస్తున్నట్లు ఆలయ అధ్యక్షుడు లక్ష్మణబాబు తెలిపారు.

టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి

చాగలమర్రి, ఏప్రిల్ 8: టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని టీఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి అన్నారు. సోమవారం టీడీపీ కార్యాలయంలో అయన మాట్లాడుతూ టీడీపీ నాయకులు, కార్యకర్తలు టీడీపీ విజయం కోసం కృషి చేయాలని అన్నారు. కార్యకర్తలే పార్టీకి కీలకమని అన్నారు. టీడీపీ ప్రవేశ పెట్టిన సూపర్-6 పథకాలు టీడీపీ ప్రభుత్వం వచ్చాక అమలవుతాయని అన్నారు. టీడీపీ, బీజేపీ, జనసేనల జెండాల అజెండా ఒక్కటేనని, ప్రజా ప్రభుత్వం రావాలన్నదే కూటమి ప్రధాన లక్ష్యమని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అనాథ శవానికి అంత్యక్రియలు


అనాథ శవానికి అంత్యక్రియలు నిర్వహిస్తున్న దృశ్యం

బేతంచెర్ల, ఏప్రిల్ 8: పట్టణంలోని దుర్గాపేటకు చెందిన కళ్ల లక్ష్మమ్మ (48) అనే మహిళ అనారోగ్యంతో ఆదివారం మృతి చెందింది. ఆమె భర్త గత కొంత కాలం క్రితం మరణించాడు. ఆమెకు ఒక కూతురు ఉంది. స్థానికంగా సమీప బంధువులు ఎవరూ లేనందున, తన తల్లి అంత్యక్రియలు నిర్వహించాలని, ఆమె కూతురు వెంకటలక్ష్మి ఆ నలుగురు స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు వన్నూరు బాషాను స్థానికులు కోరారు. ఆయన తన సంస్థ సభ్యులతో బేతంచెర్ల శ్మశాన వాటికలో లక్ష్మమ్మ అంత్యక్రియలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సభ్యులు నాగేశ్వరరెడ్డి, లక్ష్మీ రాఘవ, సద్దాం, యూసుఫ్, అక్బర్, నాగరాజు, మాబాషా పాల్గొన్నారు.

కోట్ల సుజాతమ్మ పరామర్శ

డోన్, ఏప్రిల్ 8: మండలంలోని యు.కొత్తపల్లి గ్రామంలో టీడీపీ నాయకుడు షేక్ భాషు మృతికి సోమవారం మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ సంతాపం తెలిపారు. కుటుంబ సభ్యులు మిన్నెల్ల హుశేన్‌ను పరామార్శించి ఆమె సానుభూతి తెలిపారు. అదే విధంగా టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వలసల రామక్రిష్ణ, మండల పార్టీ అధ్యక్షులు శ్రీనివాసులు యాదవ్, రంజిత్ కిరణ్‌లు సంతాపం తెలిపారు.

సంపద సృష్టికర్త చంద్రబాబు

టీడీపీ హయాంలోనే ముస్లింలకు రక్షణ

మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి


విలేకరులతో సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి

బనగానపల్లె, ఏప్రిల్ 8: రాష్ట్ర అభివృద్ధి కోసం సంపదను ఎలా సృష్టించాలో చంద్రబాబుకు బాగా తెలుసని బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే, టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బీసీ జనార్దన్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం బనగానపల్లె టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. టీడీపీతోనే సంక్షేమం జరుగుతుందన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని సుభిక్షంగా ఉంచగలిగే మహామనిషి నారాచంద్రబాబునాయుడు అని బీసీ కొనియాడారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత 20 లక్షల ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. నిరుద్యోగ యువతకు నెలకు రూ.3వేలు నిరుద్యోగ భృతి ఇస్తామన్నారు. యువతకు మెగా డీఎస్సీ, జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామన్నారు. పెంచిన పింఛన్లను జూన్‌నెల నుంచే అందజేస్తామని తెలిపారు. వైసీపీ పింఛన్ల విషయంలో శవరాజకీయాలకు పాల్పడుతోందన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే పేదలకు ఉచితంగా ఇసుకను అందిస్తామన్నారు. నందికొట్కూరులో తరావీహ్ నమాజ్ చేసుకుని ఇంటికి వెళ్తున్న ముస్లిం మహిళపై వైసీపీ నాయకుడు శ్రీనివాసరెడ్డి అసభ్యకరంగా పాల్పడ్డాడన్నారు. వైసీపీ నాయకుల తీరు రోజురోజుకూ నీచంగా మారుతోందని బీసీ జనార్దన్ రెడ్డి అన్నారు. వైసీపీ నేతల అరాచకాలతో అనేక ముస్లిం కుటుంబాలు ప్రాణాలు కోల్పోయారన్నారు. గురజాలలో మైనర్ ముస్లిం బాలికపై అత్యాచారంచేసిన నిందితుడిపై కనీస చర్యలు లేవని బీసీ విమర్శించారు. నిందితునికి వైసీపీ ఎమ్మెల్యే మద్దతు ఇవ్వడం దారుణమన్నారు. మైనార్టీలకు 4శాతం రిజర్వేషన్ల అమలుకు టీడీపీ మద్దతు ఇస్తుందన్నారు. ముస్లింల కోసం మైనార్టీ రుణాలు, దుల్హన్ పథకాలు ఇచ్చిందని టీడీపీ అధికారంలోకి వస్తే తిరిగి ఆ పథకాలను పునరుద్ధరిస్తామన్నారు.

బాబు వస్తేనే రాష్ట్రానికి మంచి రోజులు

డోన్ టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి


మాట్లాడుతున్న కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి

ప్యాపిలి, ఏప్రిల్ 8: చంద్రబాబు అధికారంలోకి వస్తేనే రాష్ట్రానికి మంచి రోజులు వస్తాయని కేంద్ర మాజీ మంత్రి, డోన్ టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని పోతుదొడ్డి గ్రామంలో ఆయన నంద్యాల పార్లమెంటు అభ్యర్థి బైరెడ్డి శబరితో కలసి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. కోట్ల ప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ జగన్ పాలనలో రాష్ట్రం అధోగతి పాలైందన్నారు. నిత్యవసర వస్తులు ధరలు ఆకాశాన్ని అంటడంతో పేద, మధ్యతరగతి వారు గగ్గోలు పెడుతున్నారన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే మహిళలకు, రైతులకు, యువత సంక్షేమానికి ప్రాధాన్యం కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర బీసీ సాధికార సమితి కన్వినర్ వై నాగేశ్వరరావుయాదవ్, టి శ్రీనావాసులు, వై లక్ష్మీనారాణయాదవ్, రాజా నారాయణమూర్తి, ఆర్ఈ నాగరాజు, గండికోట రామసుబ్బయ్య, రామ్మోహన్‌యాదవ్, భాస్కర్‌నాయుడు, ఏనుగమర్రి రామక్రిష్ణ, రజనికాంత్‌రెడ్డి, కదిరప్ప, నారాయణ పాల్గొన్నారు.

డోన్, ఏప్రిల్ 8: టీడీపీ అధినేత చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తర్వాత దివ్యాంగులకు నెలకు రూ.6వేలు పింఛన్ ఇవ్వడం జరుగుతుందని మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ అన్నారు. సోమవారం మండలంలోని ఎద్దుపెంట, అనుంపల్లి గ్రామాల్లో ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. టీడీపీ మేనిఫెస్టో కరపత్రాలను ఇంటింటికి తిరిగి పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వలసల రామక్రిష్ణ, మాజీ జడ్పీ చైర్మన్ బత్తిన వెంకట్రాముడు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ టీఈ కేశన్నగౌడు, మాజీ ఎంపీపీ శేషఫణిగౌడు, శేషిరెడ్డి ధర్మవరం భరత్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు శ్రీనివాసులు యాదవ్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు ప్రజావైద్యశాల మల్లికార్జున, భాస్కర్ నాయుడు, దేవరబండ వెంకటనారాయణ, వలసల బాలుడు, మాజీ సర్పంచ్ ఈశ్వరయ్య, మల్లీశ్వరయ్య, మిద్దెపల్లి గోవిందు, రంగనాథమయ్య, న్యాయవాది లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.


మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ సమక్షంలో టీడీపీలో చేరిన మల్లెంపల్లె వైసీపీ కార్యకర్తలు

● పట్టణంలోని కోట్ల నివాసంలో సోమవారం మల్లెంపల్లి గ్రామానికి చెందిన వైసీపీ కార్యకర్తలు మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ సమక్షంలో టీడీపీలో చేరారు. బైటోళ్ల మద్దయ్య, బలరాముడు, పెద్ద మధు, మాధవ కృష్ణ, నడిపి మాదులు, చిన్న సుంకన్న, చిన్నమధు, నాగరాజు, శేషాద్రి నాయుడుతో పాటుమరో 20 మంది కార్యకర్తలు టీడీపీలో చేరారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వలసల రామక్రిష్ణ, మండల పార్టీ అధ్యక్షులు శ్రీనివాసులు యాదవ్, మల్లెంపల్లి మాధవకృష్ణ, పాల్గొన్నారు.

మంత్రి రాయబారిగా ఓ పోలీసు అధికారి

● బేతంచెర్ల మండలంలో వైసీపీ అసంతృప్తులకు బుజ్జగింపులు

డోన్, ఏప్రిల్ 8: ఆయన ఓ సీఐ స్థాయి పోలీసు అధికారి.. గతంలో మంత్రి ఇలాకాలో పని చేశారు. సదురు ఖాకీ సారూ మంత్రి సేవలో తరిస్తూ విధులు నిర్వహించారు. అక్కడి నుంచి బదిలీపై వెళ్లినా మంత్రిపై ప్రేమ చావలేదు. ప్రస్తుతం ఎన్నికల సమయం కావడంతో మంత్రి రాయబారిగా సదురు పోలీసు అధికారి వైసీపీ అసంతృప్తులకు బుజ్జగింపులు చేస్తున్నాడు. ఇదీ డోన్ నియోజకవర్గంలో హాట్ టాపిక్‌గా మారింది. నియోజకవర్గంలోని బేతంచెర్లలో ఓ పోలీసు అధికారిగా ఆయన మూడేళ్లకు పైగానే పని చేశారు. అక్కడి నుంచి ఉమ్మడి జిల్లా కేంద్రానికి బదిలీ అయ్యారు. మంత్రికి ఎన్నో అనుకూలమని సదురు పోలీసు అధికారికి పేరుంది. ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో నియోజకవర్గంలోని బేతంచెర్ల మండలంలోని వైసీపీలో ఆయా గ్రామాల్లో పలువురు నేతలు అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. దీంతో మంత్రి రాయబారిగా సదురు పోలీసు అధికారి రంగంలో దిగారు. ప్రభుత్వ ఉద్యోగులు రాజకీయ పార్టీ వ్యవహారాల్లో పాల్గొనకూడదని ఎన్నికల కోడ్ నిబంధనలున్నాయి. అయినా వాటిని బేఖాతరు చేస్తూ సదురు పోలీసు అధికారి బేతంచెర్ల మండలంలో అసంతృప్తి వైసీపీ నాయకులను బుజ్జగించే ప్రయత్నాలు చేస్తున్నారు. సదురు పోలీసు అధికారి తీరుపై టీడీపీ వర్గాలు మండిపడుతున్నాయి. ఎన్నికల కోడ్ నిబంధనలు ఉల్లంఘిస్తూ మంత్రికి అనుకూలంగా పని చేస్తుండటంపై కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తున్నట్లు టీడీపీ వర్గాలు తెలిపాయి.

కొండముచ్చు కోసం గాలింపు


డోన్ ఇంద్రానగర్‌లో కొండముచ్చు కోసం విచారిస్తున్న అటవిశాఖ అధికారి

డోన్(రూరల్), ఏప్రిల్ 8: పట్టణంలో గత రెండు రోజులుగా చిన్నారులు, వృద్ధుల మీద దాడి చేసి గాయపరుస్తున్న కొండముచ్చు కోసం అటవీశాఖ అధికారులు గాలింపు చర్యలు చేపట్టారు. పట్టణంలోని పాతపేట, ఇంద్రానగర్ తదితర ప్రాంతాల్లో కొండముచ్చు కదలికల వివరాలను సబ్ డీఎఫ్‌వో సూర్యచంద్రరాజు, డోన్ ఫారెస్ట్ రేంజర్ ప్రవీణ్ కుమార్‌తో కలిసి విచారించారు. ప్రత్యేక బృందంతో కొండముచ్చును పట్టుకుని అటవీ ప్రాంతంలోకి తరలి స్తామని వారు తెలిపారు. వారి వెంట ఇన్‌చార్జి డీవైఆర్‌వో శివశంకర్, ఎఫ్‌బీవో విష్ణువర్ధన్ ఉన్నారు.

దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి : టీడీపీ


మాట్లాడుతున్న టంగుటూరు శ్రీనయ్య

బనగానపల్లె , ఏప్రిల్ 8: రాష్ట్రంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలపై వైసీపీ మూకలు దాడులు చేస్తున్నాయని, అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని టీడీపీ నంద్యాల జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు టంగుటూరు శ్రీనయ్య డిమాండ్ చేశారు. సోమవారం టంటుటూరు శ్రీనయ్య కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ విజయవాడ అర్బన్ ఆర్యవైశ్యసంఘం ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ టీడీపీ వాణిజ్య విభాగం అధ్యక్షుడు డూండీ రాకేశ్‌పై వైసీపీ ఎమ్మెల్యే వెల్లంపల్లి శ్రీనివాస్ అనుచరులు దాడులు చేయడం అమానుషమన్నారు. దాడి చేయడమే గాక మాచవరం పోలీస్‌స్టేషన్‌కు డూండీరాకేశ్‌ను తరలించడం దారుణమన్నారు. డూండీ రాకేశ్‌పై దాడి చేసిన వారిపై, అలాగే వెల్లంపల్లిశ్రీనివాస్‌పై కఠినచర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో విశ్రాంత ఎంఈవో పక్కీరారెడ్డి, టీడీపీ నాయకుడు వంగల పరమేశ్వరరెడ్డి, లాయర్ నాగేంద్రారెడ్డి, ఆర్‌సీ నాగిరెడ్డి, ఖాదర్ పాల్గొన్నారు.

అమవాస్య పూజలు


చాగలమర్రిలో శివపార్వతులకు దీపాలతో హారతులు ఇస్తున్న మహిళలు

చాగలమర్రి, ఏప్రిల్ 8: చాగలమర్రి గ్రామంలోని కోదండరామ, పట్టాభిరామ, రామలింగేశ్వర ఆలయాల్లో సోమవారం వేద పండితుల ఆధ్వర్యంలో అమవాస్య పూజలు నిర్వహించారు. కోదండ రామాలయంలో మహిళలు తెల్లవారుజామున దీపాలు వెలిగించి దీపోత్సవం చేశారు. 108 దీపాలచే ప్రత్యేక హారతులు ఇచ్చారు. అలాగే గంగమ్మ, చాగలమ్మ, చెన్నకేశవ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

బేతంచెర్ల: పట్టణ శివారులోని కొలుములపల్లెరస్తాలో గాడుబావి సమీపంలో వెలసిన అభయాంజనేయస్వామికి భక్తులు సోమవారం అమావాస్య పర్వదినం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి ఉత్సవ విగ్రహానికి ఆలయ ప్రాంగణంలో భక్తులు అభిషేకాలు, ఆకుపూజ, కుంకుమార్చన పూజలు జరిపారు. ఆలయ నిర్వాహకులు ఉదయం భక్తులకు అల్పాహారం పంపిణీ చేశారు.


ఆంజనేయస్వామి ఉత్సవ విగ్రహానికి అభిషేకం చేస్తున్న భక్తులు

నంద్యాల, ఏప్రిల్ 8, ఆంధ్రజ్యోతి: అహోబిలం లక్ష్మీనరసింహస్వామికి సోమవారం అమావాస్య పూజలు జరిగాయి. దిగువ అహోబిలంలోని మఠంలో ఏర్పాటు చేసిన స్వర్ణ మాలోల నరసింహస్వామికి, పంచపర్వ ఉత్సవంలో భాగంగా భూసమేత ప్రహ్లాదవరదస్వామికి నవకలశ తిరుమంజనం కార్యక్రమంలో పీఠాధిపతి రంగనాధయతీంద్ర మహాదేశికన్ సమక్షంలో వేదపండితులు పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు తీర్థప్రసాదాలను అందించారు.

ఘనంగా యాగంటి పల్లకీ సేవ


యాగంటిలో పల్లకీ సేవలో పాల్గొన్న భక్తులు

బనగానపల్లె, ఏప్రిల్ 8: యాగంటి ఉమామహేశ్వరస్వామి ఆలయంలో సోమవారం పల్లకీ సేవ ఉత్సవం సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఆలయ చైర్మన్ తోటబుచ్చిరెడ్డి, ఈవో చంద్రశేఖర్‌రెడ్డి, పాతపాడు సర్పంచ్ మహేశ్వరరెడ్డితో పాటు భక్తులు, ఆలయ పూజారులు పల్లకిలో ఉమామహేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు.

ఇఫ్తార్ విందులో బీసీ రాజారెడ్డి


ఖాజీవాడ మసీదులో భోజనం వడ్డిస్తున్న మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి

బనగానపల్లె, ఏప్రిల్ 8: పట్టణంలోని ఖాజీవాడ మసీదులో సోమవారం నిర్వహించిన ఇఫ్తార్ విందులో బనగానపల్లె మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి పాల్గొన్నారు. ఖాజీవాడ మసీదు నిర్వాహకుల ఆహ్వానం మేరకు బీసీ రాజారెడ్డి ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. స్వయంగా బీసీ రాజారెడ్డి ఇఫ్తార్ విందు వడ్డించారు. కార్యక్రమంలో కాశీంబాష, అల్తాఫ్‌హుసేన్ పాల్గొన్నారు.

మూడు రాజధానుల పేరుతో డ్రగ్స్ దందా


శిరివెళ్లలో పథకాలు వివరిస్తున్న టీడీపీ అభ్యర్థి భూమా అఖిలప్రియ

శిరివెళ్ల, ఏప్రిల్ 8 : రాష్ట్రంలో మూడు రాజధానుల పేరుతో జగన్ విశాఖపట్టణంలో కూర్చుని డ్రగ్స్ దందాను ప్రోత్సహిస్తున్నారని మాజీ మంత్రి, ఆళ్లగడ్డ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి భూమా అఖిలప్రియ ఆరోపించారు. శిరివెళ్లలోని తెలుగుపేటలో ఆమె సోమవారం ప్రచారం నిర్వహించి టీడీపీ మినీ మేనిఫెస్టోలోని పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ కాటంరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ యామా గుర్రప్ప, సూరా రామ, కొండబోయిన బాలచంద్రుడు, సగ్గెల లింగమయ్య, చిలకల పెదరాయుడు, పీపీ లింగమయ్య, తిరుమల రవి, బీసీ ఫిదా హుసేన్, యామా శ్రీనివాసులు, ఉల్లి వెంకట సుబ్బయ్య పాల్గొన్నారు.

టీడీపీలోకి చేరికలు

ఉయ్యాలవాడ, ఏప్రిల్ 8: మండలంలోని బోడెమ్మనూరు, ఒంటెద్దపల్లె గ్రామాలకు చెందిన 50 వైసీపీ కుటుంబాలు టీడీపీలో చేరాయి. వీరిని టీడీపీ యువనాయకుడు భూమా జగత్‌విఖ్యాత్‌రెడ్డి కండువా కప్పి టీడీపీలోకి ఆహ్వానించారు. మంగళవారం బోడెమ్మనూరు గ్రామానికి చెందిన కేవీ ప్రసాద్‌రెడ్డి, కే. వీరారెడ్డి, బీ. భాస్కర్‌రెడ్డిలతో మరో 30 మంది, ఒంటెద్దుపల్లె గ్రామానికి చెందిన రవిప్రకాష్ రెడ్డి, సునీల్, జయన్న, రాజులతో పాటు మరో 20 మంది పార్టీలో చేరారు. వీరి వెంకట మండల టీడీపీ నాయకులు మారంరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, బోరెడ్డి శేఖర్‌రెడ్డి, కూడాల నారాయణరెడ్డి, పేరెడ్డి మోహన్‌రెడ్డి, బోరెడ్డి వేణుగోపాల్‌రెడ్డి, కర్రా రమేషరెడ్డి, పల్లె బాబుల్‌రెడ్డి, చిట్టిపురాజగోపల్‌రెడ్డి, కర్నాటి మహేశ్వరరెడ్డి, నారాయణరెడ్డి, హరిప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'కోట్ల, కేఈలతోనే డోన్ అభివృద్ధి'

డోన్(రూరల్), ఏప్రిల్ 8: కోట్ల, కేఈ హయాంలోనే డోన్ నియోజకవర్గంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయని వెంకటనాయునిపల్లె గ్రామ సర్పంచ్ సీలం చంద్రశేఖర్ నాయుడు అన్నారు. సోమవారం సాయంత్రం వెంకటనాయునిపల్లె గ్రామ టీడీపీ కార్యకర్తలతో కలిసి ఆయన మాట్లాడారు. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ప్రజలకు అందించే సూపర్ సిక్స్ పథకాల గురించి ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డోన్ నియోజకవర్గంలో ప్రస్తుత వైసీపీ పాలకులు పలు గ్రామాలకు రోడ్లు వేసి అభివృద్ధి చేస్తున్నామని గొప్పలు చెబుతున్నారని ఎద్దేవా చేశారు. ఈ సమావేశంలో మద్దయ్య, బ్రహ్మానందం, చిన్నపుల్లయ్య, మౌలాలి తదితరులు పాల్గొన్నారు.

మా గ్రామంలో ఉపాధి పనులు చేపట్టండి

రుద్రవరం, ఏప్రిల్ 8 : మండలంలోని పేరూరు గ్రామంలో ఉపాధి పనులు ప్రారంభించాలని ఉపాధి కూలీలు కోరారు. గ్రామంలో పనులు లేక ఇబ్బంది పడుతున్నామన్నారు. గ్రామఫీల్డ్ అసిస్టెంటు వెంకటేశ్వర్‌రెడ్డి గ్రామానికి రావడం లేదని కూలీలు వాపోతున్నారు. విషయంపై ఏపీడీ సాంబశివరావు మాట్లాడుతూ పేరూరు గ్రామ ఫీల్డ్ అసిస్టెంటు వెంకటేశ్వర్‌రెడ్డి చర్యలు తీసుకుంటామని, గ్రామంలో ఉపాధి పనులు కల్పిస్తామని అన్నారు.

ఎన్నికల కోడ్ నియామవళికి లోబడి పనిచేయాలి

రుద్రవరం, ఏప్రిల్ 8 : ఎన్నికల కోడ్ నియమావళికి లోబడి పనిచేయాలని మాడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ అధికారి రామచంద్ర అన్నారు. సోమవారం మండలంలోని హరినగరం, ముకుందాపురం చిత్తరేణిపల్లె గ్రామాలను సందర్శించారు. గ్రామాల్లో ఎన్నికల కోడ్ ఏమైనా ఉల్లంఘన చేస్తున్నారా అన్న అంశాలను పరిశీలించారు. కోడ్ నియమావళిని ప్రతి ఒక్కరూ లోబడి పనిచేయాలని సూచించారు.

నాటుసారా బట్టీలపై దాడులు

బేతంచెర్ల, ఏప్రిల్ 8: మండలంలోని బుగ్గానిపల్లెతాండా గ్రామ పరిసర ప్రాంతాల్లో నాటుసారా స్థావరాలపై ఎస్ఐ శివశంకర్ నాయక్ తన సిబ్బందితో విస్తృత దాడులు సోమవారం నిర్వహించారు. ఈ దాడుల్లో గ్రామానికి చెందిన పాండు నాయక్ సారా బట్టీని 200 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు ఎస్ఐ శివశంకర్ నాయక్ తెలిపారు. నాటుసారా బట్టి నిర్వహిస్తున్న పాండు నాయక్‌ను అరెస్టు చేసి 24 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పైలేరియా వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలి

కోవెలకుంట్ల, ఏప్రిల్ 8: పైలేరియా వ్యాధి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మాయలూరు వైద్యాధికారి డాక్టర్ రాబర్టు కెనెడీ సూచించారు. సోమవారం కోవెలకుంట్ల గ్రామ పంచాయతీలో పైలేరియా వ్యాధి సోకిన ముగ్గురికి సామగ్రి, మందులు పంపిణీ చేశారు. డాక్టర్ మాట్లాడుతూ పైలేరియా సోకిన వారు పైవాటిని ఇతరులు వాడరాదన్నారు. వ్యాధి పట్ల జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వ్యాధి సోకిన వారు జాగ్రత్తలు పాటించి వ్యాధిని నివారించుకోవాలన్నారు. కార్యక్రమంలో సబ్‌యూనిట్ అధికారి విశ్వనాథ్, హెల్త్ సూపర్‌వైజర్ మునిస్వామి, ఆరోగ్యకార్యకర్తలు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీతోనే బీసీల అభివృద్ధి

కోవెలకుంట్ల, ఏప్రిల్ 8: తెలుగుదేశం పార్టీతోనే బీసీల అభివృద్ధి సాధ్యమని బనగానపల్లె నియోజకవర్గం టీడీపీ బీసీ సంఘం కన్వీనర్ నడిపిభూషన్న, కోవెలకుంట్ల మండల టీడీపీఅధ్యక్షుడు అమడాల మద్దిలేటి, గజ్జల హుసేనయ్య, గుల్లదుర్తి సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం కోవెలకుంట్ల మండలంలోని బిజనవేముల, గుల్లదూర్తి గ్రామాల్లో జయహో బీసీ కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ బీసీలు అందరూ ఏకమై టీడీపీని గెలిపించాలన్నారు. అలాగే గుల్లదూర్తిలో బీసీ సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో వెలగటూరు ధనుంజయుడు, సుబ్బరాయుడు, నడిపి బూషన్న, బాలనాయుడు, చిన్నస్వామి,పెద్దహుసేనయ్య, మనోహర్, రాధాకృష్ణమూర్తి, షరీఫ్, గుల్లగుర్తికి చెందిన టీడీపీ నాయకులు సుదర్శన్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, గోవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరిస్తాం

కొలిమిగుండ్ల , ఏప్రిల్ 8: మండలంలోని నీటి సమస్యను పరిష్కరిస్తామని ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ సుబ్రహ్మణ్యం సోమవారం తెలిపారు. అబ్దుల్లాపురం, కోరుమానుపల్లెలో కొత్తబోర్లు వేసి మోటార్లు అమర్చి తాగునీరు అందిస్తున్నామన్నారు. లక్షుంపల్లెలో రైతు బోరును కౌలుకు తీసుకున్నామన్నారు. గ్రామాల్లో తాగునీటి సమస్యలు ఉంటే తమ దృష్టికి తెస్తే పరిష్కరిస్తామని తెలిపారు.